# వాళ్ళనలా వదిలేద్దాం

శ్రీ నేమాని సంగమేశ్వరరావు

(గతసంచిక తరువాయి)

3

దమయంతి జీవితంలో ప్రభాకరుని పరిచయం ఎలా పనిచేసిందో, ప్రభాకరుని జీవితంలో దమయంతి సందర్శనం అలాగే పనిచేసింది!

ప్రభాకరునికీ దమయంతికీ మనస్తత్వంలోనూ, ఊహలు ఉద్దేశాలలోనూ చాల తేడావుంది!

ఎప్పుడూ ఆడంబరముగా, డాబుగా లోకములో విహరించే విలాసజీవి ప్రభాకరుడు. స్నేహితులచేత మెప్పులు పడుతూ వారిని మెచ్చుకుంటూ ఎప్పుడూ ఏదో ఆనందముతోగాని ఆసక్తితోగాని జీవితం గడుపుతూ వుంటాడు.

అసలు తుమ్మెదవంటి మనస్తత్వం కలవాడు ప్రభాకరుడు. "అందం ఎందుకు పుట్టింది - అంటే అనుభవించడానికి! నూతనత్వం లేనిదీ జీవితంలో హాయి లేదు!"- అని నిర్వచనాలు చెపుతూ వాటిని అక్షరాలా ఆచరణలో పెట్టే విపరీత స్వభావుడు!

పచ్చకామెర్ల రోగికి ప్రపంచమంతా పచ్చగా కనిపించినట్లు ప్రపంచములో వుండే విలాసాలు, విహారాలు తప్పించి ఇంకేమీ కనిపించవ్! చూడడు! ఇంకే తలంపులు వచ్చినా బలవంతంగా వాటిని బయటకు నెట్టేస్తాడు!

అతి చంచలమయిన స్వభావంతో ఏ నిర్ణయానికి రాలేక, సమయానుకూలంగా మార్పు చేసుకుంటూ వుంటాడు ప్రభాకరుడు. అతడు దేన్నిగురించి ఆలోచించడు. ఆలోచన అన్న పదం అతని జీవితంలో లేనే లేదు. ఏదో ఒకటి చేసివేస్తాడు.

దమయంతి ఏమి చూసుకొని ప్రభాకరాన్ని తన మనోవీధులో తన ప్రక్క నిలబెట్టుకుందో!

చటుక్కున ఒక నిర్ణయానికి రాలేని దమయంతి కూడా ఆవాళ ఒక నిర్ణయానికి వచ్చేనముకుంది! తనలోవున్న లోపం తనకి తెలిసినట్టు భావించింది కాని తెలుసుకోలేక పోయింది!

తూర్పు పడమరలు ఏకం అవవు! ఈ సంగతి 19 ఏళ్ల దమయంతికే కాదు ఆరు సంవత్సరాల బాలుడు కూడా ఘంటాపథంగా చెప్పగలడు.

అయితే తూర్పు అంటే ఏమిటి? పడమర అంటే ఏమిటి? ఎందుకు కలియవు? ఈ

సంగతి మొదట తెలుసుకుంటేగాని ఎందుకు కలియవో తెలియవు!

అల్లాగే ఏ సంగతి సరిగ్గా నిర్ణయించు కోకుండా ప్రభాకరం జీవితంలో తను కలిసి పోగలను అనే ధీమా ఒకటి కలిగింది దమయంతికి.

మానవుల్లో దేవతలు, మానవులు, దానవులు వున్నారు! అయితే ఈ సంగతి మాత్రం అట్టే ప్రపంచ జ్ఞానములేని దమయంతి మాత్రం వూహించలేకపోయింది.

పైకి చూడడానికి బాగుండగానే లోపల మనస్సు, అంతఃకరణ స్వచ్ఛముగా వుంటుందనుకోవడం పొరబాటు. ఈ పొరబాటే దమయంతీ సహజంగా చేసింది.

ఇంతకీ పెళ్ళీ వగైరాలు కాలేదు. అవవచ్చు! అవకపోవచ్చు! రాబోయే ఆపద గూర్చి విచారించేవాళ్లు మూర్ఖులు. ఈ విషయం ఆలోచిస్తూ దమయంతి తెలివి తక్కువగా ప్రవర్తించి బేలఅయిందని చెప్పక తప్పదు.

దమయంతిని మానసిక వ్యధలు కృంగ తీస్తూవుంటే ప్రభాకరరావును వాతావరణ ప్రభావం లేవతీస్తున్నాది.

అంతకు ముందే ఎంతోమందిని ఎంచి, అనుభవించి, పిప్పిని పారేసినట్టు పారేసిన ప్రభాకరరావు దమయంతిని చూడగానే ఆవిధంగా ఆమెను తలపెట్టడం మాని తన జీవితంలో భాగస్వామిని చేసుకుందామని అనుకోవడం నిజంగా ప్రభాకరరావులో ఒక పెద్ద మార్పేఅని చెప్పవచ్చు?

అయితే ఈమెను వివాహం చేసికోవాలనే వాంఛ ప్రభాకరరావులో మామూలుగానే కలిగింది.

అది నెఱవేరవచ్చు! నెఱవేరకపోవచ్చు! నెఱవేరితే ఆలస్యమవవచ్చు! అందుచేత అప్పుడు చూసుకోవచ్చు అని ఆ వుద్దేశాలు అక్కడతో తుంచి "ప్రస్తుతం" ఆలోచించుకుంటూ నడవసాగేడు,—ప్రభాకరరావు దమయంతి యింట్లోంచి బయటకు రాగానే!

క్రిష్టాకేఫ్‌లో దూరిన ప్రభాకరరావు వాచీ 8½ గంటలు చూపడం గమనించేడు.

రెండు మెతుకులు నోట్లోవేసుకొని సిగిరెట్ ముట్టించి మెల్లిగా వసుందర ఇంటికి దారి తీసేడు!

ఉన్నతమయిన చదువు, సంస్కారము వున్నాయి ప్రభాకరరావులో. అలా అని నీచ భావాలు లేకపోలేదు; స్థిరత్వములేని వుత్తమ నీచభావాలు రెండూ మిళితమై వున్నాయి ప్రభాకరరావులో! దేనికయినా ఇట్టే దాసుడు అయిపోగలడు!

తలుపు తట్టేడు. ఇరువది ఐదేళ్ల వయస్సులోవున్నప్పటికీ కృత్రిమ అలంకరణతో 19 ఏళ్లవయసు కత్తెలాగ అగుపించే

వసుంధర తలుపు తీసింది. "Good Night Darling"! అంటూ ఆమె గడ్డం తన చేతితో తాకి మంచంమీద వాలేడు కోటుబూటు విప్పకుండానే.

"నమస్కారం! ఎప్పుడొచ్చేరు మద్రాసునుండి?"

"ఎప్పుడోనా! ఇవాళ పుదయమే! ఈ పూళ్లో వుంటే నిన్ను కలియకుండ వుండ గలనా—?"

"ఆమాటలకేమిలెండి! ఇన్నాళ్లబట్టి నేను జ్ఞాపకమొచ్చెనా? మద్రాసునుండి నాకు ఒక్క ఉత్తరమయినా రాశారా?" అంది ప్రేమ ఒలకపోస్తూ వయ్యారంగా.

"అదే చెబుదామనుకుంటున్నాను. పిచ్చిదానా! మద్రాసులో నేను గడ్డి కోస్తున్నాననుకున్నావా?"

"అని నేననలేదే!" అంది హుషారుగా.

"నువ్వు బయటకు అనలేదనుకో! కాని నీ మనస్సులో వుంది కదూ!" అన్నాడు. ఏదో తెలియని గొప్ప విషయం తెలుసుకున్నట్లు "నా మనస్సులో ఏముందో తెలుసుకునే పరిజ్ఞానం మీకున్నట్లు మాట్లాడుతున్నారే! కాని నా మనస్సులో అది లేదు" అంది.

"అయితే నీ మనస్సులో యేమిటి వుంది?"

"మీరు చదువుపేరు చెప్పి మద్రాసులో వుంటూ సీతాకోక చిలుకల్ను వెంటాడుతున్నారు కదూ! అవునా?"

కాంతిలేని కళ్లు నీరసంగా ప్రకాశింప జేస్తూ అంది.

"చంపేశావ్! అసలు నాకు వీటికి తీరిక ఎక్కడ?— నేను చదివిన దేమిటో నీకు తెలుసా? M.B.B.S.—"! అన్నాడు కొంచెం గొప్పగా "M.B.B.S. అయితే ఏం పోయింది? అయినా మీరు చదివింది ఆ చదువుగాని ఈ చదువు కాదుగా"!

సిగరెట్ పొగ "రింగ్స్"గా వదులుతూ "వసూ! ఎంత అందంగా కనబడుతున్నావ్ యివాళ! ఎందుకంత దూరంగా నిలబడతావ్? రా! కూర్చో!"

"మీరు లేచి కోటూబూటు యిప్పండి" అంటూ చెయ్యి అందిచ్చింది.

"తేంక్యూ" అంటూ లేచి కోటు విప్పి ఆమెకు యిచ్చేడు.

జేబుల బరువుపసిగడుతూ ఒయ్యారంగా తీసికెళ్లి దానిని వంకీకి తగిల్చివచ్చింది. జోడువిప్పి ఒకమూల పారేసి మంచంమీద వాలేడు ప్రభాకరరావు.

"ఏదీ వసూ! ఒక కిల్లీ అందుకో!" అన్నాడు. వసుంధర బయటకువెళ్లి ఆకులు, వక్కలు, సిగరెట్ప్యాకట్, గ్లాస్కులో

కాఫీ తెప్పించింది. ఆకులు నములుతూ వసుంధరను లాక్కున్నాడు; దీపం తగ్గించి వచ్చింది వసుంధర.

ఉదయం సూర్యకాంతి జాఫ్రీలోంచి ముఖంమీద పడగానే తెలివి వచ్చింది ప్రభాకరానికి. వసుంధర అంతకు ముందే లేచింది కాబోలు అక్కడలేదు. వాచీ చూసుకునేసరికి ఏడుంపావు అయింది. ఆదరా బాదరాగా లేచి కోటు జేబీలోవున్న దువ్వెన్న తీసేడు. తల ఒకమారు మీదికీ ఎగదువ్వి ఒకమాటు రుమాలుతో గట్టిగా ముఖం తుడిచేడు. కోటు వేసుకొని జేబులు చూచుకున్నాడు. జేబు బరువు తగ్గింది! జేబులో చెయ్యిపెట్టి పర్సుతీసి చూసేడు. ఒక రూపాయి కాగితం కొంత చిల్లరవుంది! నవ్వుకొన్నాడు. పర్సు బటను తగిలించి జేబులో పెట్టేడు.

(సశేషము)







అన్ని మందుల షాపులలోను లభించును